క్లుప్తంగా

వ్యక్తిపై పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి దాడి

లక్ష్మీపురం: ఓ వ్యక్తిపై టీడీపీ పశ్చిమ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు శివప్రసాద్ అలియాస్ బెంగుళూరు శివ మద్దతుదారులు దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ ప్రాంతానికి చెందిన రాయపాటి అప్పారావు, చిట్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. గుంటూరు క్లబ్‌లో అప్పారావుకు టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రధాన అనుచరుడిగా చెప్పుకుంటున్న వ్యక్తికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తోటి స్నేహితులు ఇద్దరికి సర్ది చెప్పడంతో రాత్రి 10.30 గంటలకు వెళ్లిపోయారు. ఎమ్మెల్యే అనుచరుడు ఉద్దేశ పూర్వకంగా సుమారు 15 మంది అనుచరులతో విద్యానగర్‌లోని అప్పారావు ఇంటికి వెళ్లి దాడి చేశారు. గాయాలు పాలైన అప్పారావును ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేక పోవడంతో బాధితుడిని నగరంపాలెం రమేష్ ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

ఆంగ్ల భాషా ప్రావీణ్యం కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్య, ఉద్యోగాల్లో రాణించేందుకు ఆంగ్ల భాషా ప్రావీణ్యం అవసరమని ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్న షీలామణి మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావడం ద్వారానే తమ ఆత్మ గౌరవాన్ని కాపాడుకోగలరని అన్నారు. కళాశాల డైరెక్టర్ నందమూరి దీప్తి మాట్లాడుతూ విద్యార్థినులు తమకు ఆసక్తి గల రంగాల్లో రాణించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ, ఆధునిక వస్త్రధారణతో టాలెంట్ షో, నృత్యాలతో అలరించారు. అనంతరం యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభావంతులుగా నిలిచిన విద్యార్థినులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి. రోహిణీదేవి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కాకుమానువారి తోట 5వ లైన్ డొంకరోడ్ ప్రాంతానికి చెందిన వండాన అశోక్ కుమార్ ఈ నెల 13 వ తేదీ రాత్రి అరండల్ పేట 2 వ లైన్‌లోని ఓ షాపు దగ్గరకు వచ్చి రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసి తాళం వేసి షాపునకు వెళ్లాడు. కొంతసేపటికి షాపు నుంచి బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల బస్టాండ్ రైల్వే స్టేషన్‌లో వెతికినా వాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకల వ్యవస్థలను గుప్పెట్లో తీసుకుంటున్న కేంద్రం

లక్ష్మీపురం: రాజ్యాంగాన్ని, సుప్రీం కోర్టును పట్టించుకోకుండా సకల వ్యవస్థలు తమ గుప్పెట్లో ఉండేలా కేంద్రం పావులు కదుపుతున్నట్లు ఎన్నికల కమిషనర్ నియామకంతో బయటపడిందని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యావేత్త, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడుతూ నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా జరిగే ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని బతికిస్తాయని, అలాంటి ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా పూర్తి చేసే బాధ్యత ఎన్నికల కమిషన్ పనితీరుపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడుతూ ప్రధాన మంత్రి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ముగ్గురితో ఉన్న కమిటియే ఇంతకాలం కేంద్ర ఎన్నికల కమిషర్‌ల నియామకం జరిపేదన్నారు. ఇప్పుడు కేంద్రం కొత్త చట్టం తెచ్చి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి బదులు కేంద్ర మంత్రిని ఆ కమిటీలో నియమించిందని చెప్పారు. కార్యక్రమంలో విద్యావేత్త సింగరయ్య పాల్గొన్నారు.

సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక నల్లచెరువు 15వ వీధిలోని పసుపులేటి గోపయ్య కళావేదికపై ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి(విజయవాడ) సౌజన్యంతో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సత్యహరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శన నిర్వహించారు. శ్రీశ్రీనివాస చైతన్య కళా నాట్య మండలి(గుంటూరు) ఆధ్వర్యంలో జరగ్గా, విశ్వా మిత్రునిగా షేక్ మీరావలి(తక్కెళ్ళపాడు), హరిశ్చంద్రులుగా ఆర్.శ్రీనివాసరావు, కలేకూరి వెంకటప్పయ్య, తాటి వీరయ్య, అరిశెట్టి శ్రీనివాసరావు తదితర పలు పాత్రల్లో పౌరాణిక పద్యాలతో ప్రదర్శన చేపట్టారు. నాటక అభిమానులను అలరించాయి. కార్యక్రమంలో గుంటూరు కళాకారుల సంఘం అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు, అమ్మిశెట్టి నాగేశ్వరరావు, సనిశెట్టి సాంబశివరావు, చెన్నుపాటి కృష్ణారావు, కూచిపూడి రత్న కుమారి పాల్గొనగా, కళాకారులను సత్కరించారు.



అభిమాన సంద్రమై..

మిర్చి రైతుకు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కదిలారు. గుంటూరు యార్డుకు బుధవారం వచ్చారు. రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు చెప్పుకునేందుకు తరలివచ్చారు. రైతులు పులికించిపోయారు. అభిమానులు అడుగడుగునా స్వాగతం పలికారు. అభిమాన సంద్రమై కదిలారు. వైఎస్సార్ సీపీ హయాంలో పొందిన మేలు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్









రిజర్వాయర్లను శుభ్రం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ తాగు నీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. రెడ్డిపాలెం రిజర్వాయర్, వెహికల్ షెడ్, సంజీవయ్య నగర్ రోడ్ విస్తరణ పనులు, నవ భారత్ నగర్, జేకేసీ నగర్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు బుధవారం పరిశీలించారు. తాగునీటి సరఫరా వ్యవస్థ అత్యంత కీలకమని, తాగునీటి శుద్ధి జరిగే హెడ్ వాటర్ వర్క్స్‌లో ప్రత్యేకంగా ల్యాబ్‌లో క్లోరిన్, నాణ్యత పరిశీలించిన అనంతరమే రిజర్వాయర్లకు సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఏఈ పరిధిలో రానున్న వేసవిని దష్టిలో ఉంచుకొని పైప్ లైన్ మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడా తాగునీటి సరఫరా అందలేదనే ఫిర్యాదు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెహికల్ షెడ్‌ని పరిశీలించి, ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో పారిశుద్ధ్య పనులకు పంపే వాహనాలు తప్పనిసరిగా నిర్దేశిత సమయానికి వెళ్లాలన్నారు. ఈ–ఆటోలు, పుష్ కాట్స్, ఇతర వాహనాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని ఏఈని ఆదేశించారు. సంజీవయ్య నగర్ గేటు నుంచి రెడ్డిపాలెం రోడ్ వరకు చేపట్టిన విస్తరణ పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. త్వరలో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులు ప్రారంభమైతే ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, కళ్యాణరావు, సతీష్ కుమార్, ఏసీపీ రెహ్మాన్, ఆర్‌ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.



రిజర్వాయర్ పరిశీలిస్తున్న కమిషనర్

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూ నగర్: కార్మికుల కుటుంబాలకు గుంటూరు నగర పాలక సంస్థ తరఫున అండగా ఉంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ ఔట్ సోర్సింగ్ కార్మికులు జూటూరి వెంకటేశ్వర రావు, బంగారు సింహాద్రి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌లను బుధవారం కమిషనర్ ఛాంబర్ లో వారి కుటుంబ సభ్యులకు అందించారు.

టెన్త్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

డీఈఓ సీవీ రేణుక

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. టెన్త్ విద్యార్థినులకు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. పబ్లిక్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉన్నందున ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యాశాఖ ఇచ్చిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉదయం, సాయంత్రం అదనపు తరగతుల్లో బోధన అందించాలని అన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా విద్యార్థినుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించిన డీఈవో రేణుక టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సూచనలు అందించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.



టెన్త్ విద్యార్థినులకు ప్రేరణ కల్పిస్తున్న డీఈఓ రేణుక

సివిల్ సప్లయిస్ హమాలీల నిరసన

లక్ష్మీపురం: సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా చిన్నఆంజనేయులు, ఎస్. వెంకటసుబ్బయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ సమీపంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో రాష్ట్ర యూనియన్ పిలుపులో భాగంగా బుధవారం ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సప్లయీస్ హమాలీ (ముఠా) వర్కర్ల కూలీ రెట్ల పెంపు జీవో విడుదల విషయంలో కాలయాపన తగ్గదన్నారు. యూనియన్ ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు అసెంబ్లీ సమావేశాల లోపైన జీఓ విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు దానం, డేవిడ్, సురేష్, నాగరాజు, కాంతారావు, ముత్యాల బాబు, వినుకొండ జాన్ బాబు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ సివిల్ సప్లయిస్ హమాలీ యూనియన్ నాయకులు

విద్యతో పాటు కళలు, క్రీడల్లో రాణించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల సమగ్ర వికాసానికి విద్యతో పాటు కళలు, సాహిత్య, క్రీడాంశాల్లో రాణించాలని ప్రముఖ సినీ, రంగస్థల, రచయిత, దర్శకుడు డాక్టర్ ఎంఎస్ చౌదరి పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల 90వ వార్షికోత్సవాన్ని గ్రానైట్ పేరుతో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆంధ్ర రంజీ ట్రోఫీ క్రికెట్ కెప్టెన్ షేక్ రషీద్ మాట్లాడుతూ క్రికెట్ క్రీడాకారునిగా గుర్తింపు పొందడం వెనుక తల్లిదండ్రులు, స్నేహితులు, గురువులు ఇచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని చెప్పారు. గుంటూరు పౌరుడిగా గర్విస్తున్నానని అన్నారు. కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాల కళాశాల సుదీర్ఘ చరిత్రలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా పనిచేసిన కొణిజేటి రోశయ్య, సినీ నటులు గుమ్మడి వేంకటేశ్వరరావు, కళాతపస్వి కె.విశ్వనాథతో పాటు వేలాది మంది విద్యావంతులై దేశ,విదేశాలలో అనేక రంగాల్లో రాణిస్తూ కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారని వివరించారు. అనంతరం విద్యార్థులకు 400కు పైగా క్రీడా, విద్యా పురస్కారాలు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, పరిపాలనా కోఆర్డినేటర్ కె.కాళిదాస్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, ప్రోగ్రాం కన్వీనర్ పీవీ రాము, డాక్టర్ ఎస్వీఎస్ గిరిజ, మాధవపెద్ది మాధవి, డాక్టర్ ఎ.బాలశౌరి, అరుణ పాల్గొన్నారు.



క్రికెటర్ రషీద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్, దుర్గాప్రసాద్ తదితరులు

నేడు జేకేసీ కళాశాలలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌స్కిల్స్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో గురువారం ''దమ్‌షరా'' పేరుతో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌స్కిల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి, భయాన్ని, దూరం చేసి, భాషా నైపుణ్యాన్ని పెంచేందుకు దోహదం చేసే పోటీల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని సూచించారు. ఆంగ్ల సామెతల ఆధారంగా నిర్వహించే పోటీలకు ఆసక్తి గల విద్యార్థులు ప్రతి కళాశాల నుంచి మూడు టీంలుగా వారి గుర్తింపు కార్డులు, ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల రూపంలో జ్ఞాపికలతో పాటు రూ.ఐదు వేలు, రూ.మూడు వేలు, రూ.రెండు వేలు అందజేస్తామని తెలిపారు.

దాడి కేసులో నిందితుల అరెస్టు

పట్నంబజారు: యువకులపై దాడిచేసి గాయపరిచిన ఘటనలో ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. నెహ్రూనగర్‌కు చెందిన శివకేశవ, మణికంఠలతో సాయిఅఖిల్, తోకల అజయ్‌కుమార్, పి.దయాకర్ మరికొంత మందితో గత కొంతకాలంగా ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో వివాదం నడుస్తోంది. ఈనెల 16న వాసవీ కాంప్లెక్సు వద్ద ఉన్న శివకేశవ, మణికంఠలపై సాయిఅఖిల్, అజయ్, దయాకర్, మరో ఐదుగురు కలిసి సర్జికల్ బ్లేడ్‌లతో దాడిచేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో ఐకమత్యంగా ఉండాలి



శోభాయాత్రలో భాగంగా ర్యాలీ



కొరిటెపాడు పార్కు ఆవరణలో ...

నగరంపాలెం: ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువులంతా ఐకమత్యంగా ఉండాలని హిందూ చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజక్ కోడూరి జయరాం అన్నారు. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బుధవారం హిందూ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అందరూ ఐక్యమత్యంగా మెలగాలని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందువులకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం శోభాయాత్రలో భాగంగా ద్విచక్ర వాహనాలతో రమేష్ ఆసుపత్రి నుంచి నగరంపాలెం మీదగా పట్టాభిపురం, కుందుల రోడ్, బృదావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం మీదగా కొరిటెపాడు శివాజీ పార్కు వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వల్లూరి జయప్రకాష్‌నారాయణ, జిల్లా సహ సంయోజకులు వీరయ్యచౌదరి, రామ్మోహన్‌రావు, వెంకటరమణ, వంగ నవీన్ రెడ్డి, డాక్టర్ నాగార్జున, కొత్తూరి వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్‌కు నివాళి

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు పార్క్ ఆవరణలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం వద్ద బుధవారం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కోటేశ్వరరావు, ఏపీ మరాఠా సంఘ కార్యదర్శి జాజిమ్ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారు సిందే లక్ష్మీనారాయణ, సభ్యులు కావే రామయ్య, శ్రీనివాసరావు, నిక్కము తనజీ, బాబర్ విఠోబా, దుర్యోధన్ పాటిల్, రామచంద్ర పాటిల్, మోతే శేషగిరిరావు, చిరుమామిళ్ల గోపికృష్ణ, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు తిరుపతిరావు, బాణాల ఆంజనేయులు నివాళులర్పించారు.

23 నుంచి మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు

- పెదకాకాని శివాలయంలో వేడుకలు ప్రారంభం
- కళ్యాణ బ్రహ్మోత్సవాలకు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ముస్తాబు
- మార్చి 1వ తేదీ వరకూ నిర్వహణ
- ఉత్సవాల నిర్వహణకు క్యూలైన్లు, పందిళ్ళు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 23వ తేదీ నుంచి మహా శివ రాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయం ప్రాంగణాన్ని రంగు రంగుల పందిళ్లతో తీర్చిదిద్దారు. ఆయా ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామిని దర్శించుకునే విధంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివాలయం మహా శివరాత్రి పండుగ శోభ సంతరించుకుంది. ఆలయానికి విద్యుత్ అలంకరణ పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ ఉత్సవాలు మార్చి 1వ తేదీ వరకూ ఘనంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా, శాస్త్రోక్తముగా శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 26వ తేదీ రాత్రి భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో మహా శివ రాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



పెదకాకాని శివాలయం రివ్యూ



లీలాకుమార్, ఆలయ డీసీ

పెదకాకాని శివాలయంలో ప్రత్యేకతలు..

పెదకాకాని శివాలయంలో యజ్ఞాల బావి నీటితో స్నానాలు, ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం, అంత్రాలయ అభిషేకములు, ఏకవారాభిషేక పూజలు, తలనీలాలు, అన్నప్రాసనలు, నామకరణలు, చెవి పోగులు కుట్టించుట, వాహన పూజలు, ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. ప్రత్యేకంగా చెప్పుకోదగిన రాహుకేతువు పూజలు అత్యంత ప్రాచుర్యం పొందినవి. ప్రతినిత్యం నవగ్రహపూజలు, దేవస్థాన యాగశాల నందు గణపతి హోమం, నవగ్రహ హోమం, నిత్య రుద్ర హోమములు, సుబ్రహ్మణ్య, చండీ హోమములు, పాశుపత హోమములు, శాంతి కల్యాణం జరుపుట ద్వారా సకల దోష నివారణ, సర్వకార్యసిద్ధి కలుగుతుందని ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు తెలిపారు.

హిందీపై ఆసక్తి పెంచుకోవాలి

కాకుమాను: మారుతున్న కాలానుగుణంగా అన్ని సబ్జెక్టులతో పాటు హిందీపై కూడా ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం హిందీ భాష పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కెనడీ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు తెలుగుతో పాటు అన్ని భాషలు ముఖ్యమేనని ఆయా భాషలపై ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి నుండే హిందీ భాషపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈసందర్భంగా నిర్వహించిన హిందీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.విజయ్ భాస్కర్, హెచ్‌ఎం బి.సత్యం పాల్గొన్నారు.

